# యోగా శిక్షణకు మోక్షమెప్పుడో?

- జిల్లాలో నిరుపయోగంగా హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు
- నిర్మించి ఏండ్లు గడిచినా ప్రారంభించని వైనం
- అందుబాటులోకి వస్తే ప్రకృతి వైద్యం, యోగాపై శిక్షణ
- ఆశ వర్కర్లను శిక్షకులుగా నియమించే యోచనలో ప్రభుత్వం



పోతంగల్‌లో నిరుయోగంగాఉన్న యోగా కేంద్రం

కోటగిరి, జూన్ 15 : ఏండ్లు గడిచినా హెల్త్ వెల్‌నెస్(ఆరోగ్య స్వస్తత) కేంద్రాలు ప్రారంభోత్సవానికి నోచుకోవడం లేదు. ఫలితంగా ప్రజలకు వైద్య సేవలు అందడం లేదు. ఆరోగ్య పరిరక్షణకు ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యవేక్షణలో ఆయుష్ విభాగం కింద వీటిని ఏర్పాటు చేశారు. యోగా శిక్షణ ద్వారా రోగాలు రాకుండా చూడడం, వస్తే త్వరగా నయం చేయడం, ఆయుర్వేదం, ప్రకృతి వైద్యాన్ని అందించి దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమన కలిగించేందుకు జిల్లా వ్యాప్తంగా 16 ఆరోగ్య స్వస్తత కేంద్రాలను ఏర్పాటు చేశారు.

**కేంద్రాల ఏర్పాటుకు రూ.96 లక్షల వ్యయం**

యునాని, ఆయుర్వేదం, హోమియో దవాఖానలకు అనుబంధంగా ఒక్కో కేంద్రానికి రూ.6 లక్షల చొప్పున రూ.96 లక్షలతో 16 కేంద్రాలు ఏర్పాటు చేశారు. హెల్త్ వెల్‌నెస్ సెంటర్లలో యోగా షెడ్డు, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించారు. దీర్ఘకాలిక బీపీ, షుగర్, అస్తామా, కీళ్ల నొప్పులు, వాపులు, కిడ్నీ సంబంధిత తదితర వైద్య సేవలు అందించాలని నిర్ణయించారు. ఆయుర్వేదం, ప్రకృతి వైద్యంపై శిక్షణ, యోగా, ఫిజియోథెరపీ ఆరోగ్య సూత్రాలు, సలహాలు, ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పించాలని భావించారు. కానీ.. హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణం పూర్తయినా ప్రారంభోత్సవానికి నోచుకోకపోవడంతో వైద్య సేవలు అందడం లేదు. అక్కడక్కడా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినా శిక్షణ, వైద్యంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టలేదు.

**నిరుపయోగంగా యోగా కేంద్రాలు..**

జిల్లాలో తొమ్మిది ఆయుర్వేద, నాలుగు యునాని, నాలుగు హోమియో వైద్యశాలల్లో హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేశారు. జిల్లాలో నిజామాబాద్, పోతంగల్, ఎడపల్లి, నవీపేట్, గుత్ప, కుద్వాన్‌పూర్, డిచ్‌పల్లి, ధర్పల్లి, పడకల్, నిజామాబాద్ అర్బన్, బోధన్ అర్బన్, నందిపేల్, భీంగల్, మోర్తాడ్, మోస్రా, పచ్చలనడ్కుడలో (యోగా కేంద్రాలు) వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేశారు.

**సిబ్బంది నియామకాలేవీ?**

ప్రతి హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో యోగా శిక్షకుడు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఫార్మసిస్టు, పారా మెడికల్ సిబ్బందిని నియమించాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు నియామకాలు చేపట్టలేదు. యోగా శిక్షణా కేంద్రాలు నిర్మించి రెండేండ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిలో యోగా శిక్షకులను తీసుకోవాలని నిర్ణయించినా అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. తాజాగా ఆశ వర్కర్లకు శిక్షణ ఇచ్చి యోగా శిక్షకులుగా నియమించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

**యోగా కేంద్రాల నిర్మాణం పూర్తయ్యింది..**

"జిల్లాలో 16 యోగా కేంద్రాలు మంజూరు అయ్యాయి. జిల్లా వ్యాప్తంగా దాదాపు అన్ని యోగా కేంద్రాల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం ఆశ కార్యకర్తలకు ముందుగా యోగాలో శిక్షణ ఇస్తారు. శిక్షణ పూర్తయ్యాక ప్రభుత్వ ఆదేశాల మేరకు కేంద్రాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేస్తాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే కేంద్రాలను ప్రారంభించి వైద్య సేవలందిస్తాం."

**- డాక్టర్ రమణ మోహన్, ఆయుష్ శాఖ జిల్లా ఇన్‌చార్జి, నిజామాబాద్**

## 'మాకు ప్రభుత్వం అన్యాయం చేస్తున్నది'

- ఎస్జీటీల ఆవేదన
- పీఆర్టీయూకు రాజీనామా దిశగా ఎస్జీటీలు



దుబ్బాక సమావేశంలో నినదిస్తున్న ఉపాధ్యాయులు

ధర్పల్లి, జూన్ 15 : పండిత్, పీఈటీ అప్‌గ్రెడేషన్‌లో అర్హత ఉన్న ఎస్జీటీలకు చోటు కల్పించకపోవడం ప్రభుత్వం తమకు చేస్తున్న అన్యాయమేనని, దీనిని పీఆర్టీయూ సైతం పట్టించుకోకపోవడం బాధాకరమని మండలంలోని ఎస్జీటీలు వాపోయారు. మండలంలోని దుబ్బాక గ్రామంలో శనివారం వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ 10 వేల ప్రాథమిక ప్రధానోపాధ్యాయుల పోస్టులను మంజూరు చేస్తానని చెప్పారని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రాథమిక పోస్టులను మంజూరు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పీఆర్టీయూ ఏకపక్షంగా పండిత్, పీఈటీలకు మద్దతుఇవ్వడం బాధాకరమని, దీనిని ఖండిస్తున్నామని అన్నారు. ఈ విషయంలో జిల్లావ్యాప్తంగా ఎమ్మెల్సీలపై తిరుగుబాటు చేస్తామని హెచ్చరించారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే తమకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు.

## నేడు హైదరాబాద్‌లో సీఎం ఇల్లు ముట్టడి

### తమకు న్యాయం చేయాలని ఎస్జీటీ ఉపాధ్యాయుల డిమాండ్



కోటగిరిలో సమావేశమైన ఎస్జీటీ ఉపాధ్యాయుల బృందం

కోటగిరి, జూన్ 15 : తమకు ఉద్యోగోన్నతి కల్పించి ప్రభుత్వం న్యాయంచేయాలని ఉమ్మడి కోటగిరి మండలాల ఎస్జీటీ ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. మండల విద్యావనరుల కేంద్రం ఆవరణలో ఎస్జీటీ ఉపాధ్యాయులందరూ శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పండిత్, పీఈటీ అప్‌గ్రెడేషన్‌లో కామన్ సీనియారిటీ ప్రకారం ఉద్యోగోన్నతి కల్పించాలని, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పోస్టుల్లో బీఈడీ అర్హత ఉన్న ఎస్జీటీ ఉపాధ్యాయులకు జీవో నంబర్ 12 ప్రకారం ఉద్యోగోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్జీటీ ఉపాధ్యాయులు, పీఆర్టీయూ పోతంగల్, కోటగిరి మండలాల అధ్యక్షులు సూదం వెంకటేశ్, గంగారాజులు, ప్రధాన కార్యదర్శులు ప్రశాంత్, కిరణ్‌బాబు, కృష్ణమోహన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

**నేడు సీఎం ఇల్లు ముట్టడి**

ఎస్జీటీ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని సీఎం ఇంటి ముట్టడి కార్యక్రమాన్ని నేడు (ఆదివారం) చేపట్టనున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్ పరిష్కారం కోసం ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు.

# నిబంధనల ప్రకారమే రుణ రికవరీ

- నోటీసులు ఇచ్చాకే రైతు భూమిలో ఫ్లెక్సీల ఏర్పాటు
- ఎన్డీసీసీబీ జీఎం సూర్యప్రకాశ్ వెల్లడి
- ఓటీఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచన



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా సహకార బ్యాంకు జనరల్ మేనేజర్ సూర్య ప్రకాశ్

లింగంపేట, జూన్15 : రుణాల వసూలు విషయంలో నిబంధనల ప్రకారమే వ్యవహరిస్తున్నామని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సహకార బ్యాంక్ జనరల్ మేనేజర్ సూర్యప్రకాశ్ పేర్కొన్నారు. పోల్కంపేట గ్రామానికి చెందిన రైతు రాజశేఖర్‌రెడ్డి 2010లో రుణం తీసుకుని ఇప్పటివరకూ చెల్లించలేదని, నోటీసులు ఇచ్చినా స్పందించక పోవడంతోనే ఆయన భూమిని వేలం వేస్తున్నట్లు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శనివారం లింగంపేటలోని సహకార బ్యాంకులో ఆయన విలేకరులతో మాట్లాడారు. బకాయిలు వసూలు కాని కారణంగా కొత్త రుణాలు ఇవ్వలేకపోతున్నామని, డిపాజిట్‌దారులకు సైతం డబ్బులు చెల్లించడానికి ఇబ్బందిగా ఉందన్నారు. బకాయిలు పేరుకుపోవడం వల్లే రుణాల రికవరీ కోసం ఇబ్బంది పెట్టాల్సి వస్తున్నదని, ఈ క్రమంలో నిబంధనల ప్రకారమే వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. సహకార బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న వారు వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) పథకాన్ని ఈ నెల 30లోపు సద్వినియోగం చేసుకోవాలని జీఎం సూర్యప్రకాశ్ కోరారు. గత రెండేండ్లుగా ఓటీఎస్ కొనసాగించడంతో బ్యాంకుకు రూ.20 కోట్ల నష్టం ఏర్పడిందన్నా రు. మొత్తం రూ. 230 కోట్ల బకాయిలకు గాను రూ.100 కోట్లు వసూలయ్యాయని, ఇంకా రూ.130 కోట్ల బకాయిలు ఉన్నట్లు చె ప్పారు. ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకుంటే పోల్కంపేట్ రాజశేఖర్‌రెడ్డికి రూ.1.70 లక్షల మాఫీ వర్తిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ కింద వ్యవసాయ రుణాలు మాత్రమే మాఫీ అవుతాయని, దీర్ఘకాలిక రుణాలకు మాఫీ వర్తించదని స్పష్టం చేశారు. డీజీఎం శ్రీనివాస్, ఏజీఎంలు యాదగిరి, నాగరాజు, రికవరీ ఏజీఎం భూపాల్‌రెడ్డి, బ్యాంకు మేనేజర్ కుమారస్వామి ఉన్నారు.

## టీయూ పరిధిలో ముగిసిన డిగ్రీ పరీక్షలు

**చివరి రోజు నలుగురు డిబార్**

డిచ్‌పల్లి, జూన్ 15 : తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ పరీక్షలు శనివారంతో ముగిశాయి. శనివారం ఉదయం డిగ్రీ 6వ సెమిస్టర్ రెగ్యులర్, 5వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్, మధ్యాహ్నం 2వ సెమిస్టర్ రెగ్యులర్, 3వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను నిర్వహించారు. వర్సిటీ పరిధిలో మొత్తం 38 కేంద్రాల్లో శనివారం నిర్వహించిన పరీక్షకు 9,022 మంది విద్యార్థులకు 8, 281 మంది హాజరుకాగా 738 మంది గైర్హాజరైనట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు 9,383 విద్యార్థులకు 8,464 మంది హాజరుకాగా.. 91 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. నిజామాబాద్‌లోని మహిళా డిగ్రీ కళాశాల, గౌతమి డిగ్రీ కళాశాల, భీమ్‌గల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నలుగురు చూచిరాతకు పాల్పడుతూ పట్టుబడినట్లు వెల్లడించారు. ఈ పరీక్షల్లో ఇప్పటివరకు మొత్తం 30 మంది డిబార్ అయినట్లు తెలిపారు.

## ఇద్దరిపై కేసు నమోదు

నవీపేట,జూన్ 15: తప్పతాగిన మైకంలో వీరంగం సృష్టించి, పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. అబ్బాపూర్(ఎం)లో అదే గ్రామానికి చెందిన శ్రీనివాస్, లక్ష్మణ్ అనే ఇద్దరు వ్యక్తులు స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో శుక్రవారం తప్పతాగిన మైకంలో వీరంగం సృష్టించారు. గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న సాయినాథ్, ఆసిఫ్ అనే ఇద్దరు కానిస్టేబుళ్లు గ్రామానికి చేరుకొన్నారు. తాగిన మైకంలో ఉన్న ఇద్దరిని సముదాయించే ప్రయత్నం చేయగా.. వారు పోలీసులతో వాగ్వాదానికి దిగి విధులకు ఆటంకం కలిగించారు. దీంతో కానిస్టేబుల్ సాయినాథ్ ఫిర్యాదు మేరకు శ్రీనివాస్, లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## వాణిజ్య



### నెక్సాన్‌పై లక్ష రూపాయల ఆఫర్

ముంబై, జూన్ 15: ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన టాటా మోటర్స్‌కి చెందిన ఎస్‌యూవీ నెక్సాన్ మరో మైలురాయిని అధిగమించింది. దేశీయ మార్కెట్లోకి అందుబాటులోకి వచ్చి ఏడేండ్లు పూర్తైన సందర్భంగా ఈ వాహనంపై ప్రత్యేక ప్రయోజనాలు కల్పిస్తున్నట్లు ప్రకటించింది. 2017 నుంచి 2024 వరకు ఏడేండ్లలో ఏడు లక్షల యూనిట్ల వాహనాలను విక్రయించినట్లు కంపెనీ చీఫ్ కమర్షియల్ అధికారి వివేక్ శ్రీవాత్సవ తెలిపారు. డిజైనింగ్, భద్రత, కంఫర్ట్, సులభంగా డ్రైవింగ్ చేసే వీలుగా డిజైనింగ్ చేయడం వల్లనే ఈ మాడల్‌కు కస్టమర్ల నుంచి విశేష స్పందన లభించిందన్నారు.

### విజయవాడ-ముంబై ఎయిర్ ఇండియా ఫ్లైట్

మచిలీపట్నం, జూన్ 15: విజయవాడ నుంచి ముంబైకి డైరెక్ట్ విమాన సేవలు ప్రారంభించింది ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్. గన్నవరంలోని విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఈ విమాన సేవలు శనివారం ప్రారంభించారు. ముంబైలో మధ్యాహ్నం 3.55 గంటలకు బయలుదేరనున్న ఏ-320 విమాన సర్వీసు విజయవాడకు సాయంత్రం 5.45కి చేరుకోనున్నది. తిరుగు ప్రయాణంలో విజయవాడలో 7.10 గంటలకు బయలుదేరి ముంబైకి రాత్రి 9 గంటలకు చేరుకోనున్నది.

### ఇంధనాలపై విండ్‌ఫాల్ ట్యాక్స్ తగ్గింపు

న్యూఢిల్లీ, జూన్ 15: ఇంధనాలపై విధించే విండ్‌ఫాల్ ట్యాక్స్‌ను కేంద్ర ప్రభుత్వం మరోసారి తగ్గించింది. టన్ను క్రూడాయిల్‌పై విధించే విండ్‌ఫాల్ ట్యాక్స్‌ని రూ.5,200 నుంచి రూ.3,250కి తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నది. తగ్గించిన రేట్లు శనివారం నుంచి అమలులోకి వచ్చాయి. తొలిసారిగా కేంద్ర ప్రభుత్వం ఈ విండ్‌ఫాల్ ట్యాక్స్‌ని జూలై 1, 2022న విధించిన విషయం తెలిసిందే.

# ఎస్బీఐ వడ్డీరేట్లు పెంపు




నూఢిల్లీ, జూన్ 15: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) రుణ గ్రహీతలకు షాకిచ్చింది. మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్-బేస్డ్ లెండింగ్ రేటు(ఎంసీఎల్ఆర్)ని 10 బేసిస్ పాయింట్లు పెంచింది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో వాహన, గృహ రుణాలపై చెల్లింపులు మరింత భారంకానున్నాయి. శనివారం నుంచి అమలులోకి వచ్చిన ఈ రుణాల్లో ఏడాది కాలపరిమితి కలిగిన రుణాలపై ఎంసీఎల్ఆర్ రేటు 8.65 శాతం నుంచి 8.75 శాతానికి సవరించింది. వాహన రుణాలు ఏడాది కాలపరిమితితో, వ్యక్తిగత రుణాలు రెండేండ్ల కాలపరిమితితో మంజూరు చేస్తున్నది బ్యాంక్. దీంతో బ్యాంక్ ఎంసీఎల్ఆర్ రేటు 8.10 శాతం నుంచి 8.95 శాతం మధ్యలో లభించనున్నాయి.

**ఎఫ్‌డీలపై కూడా..**

ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీరేటును బ్యాంక్ సవరించింది. గతంలో రూ.2 కోట్ల లోపు డిపాజిట్లపై వడ్డీరేటును పెంచిన ఎస్బీఐ..తాజాగా రూ.3 కోట్ల లోపు డిపాజిట్లపై వడ్డీరేటును 75 బేసిస్ పాయింట్ల వరకు సవరించింది. ఏడు రోజుల నుంచి 45 రోజుల లోపు డిపాజిట్లపై వడ్డీని 3.5 శాతం నుంచి 4 శాతానికి, 46 రోజుల నుంచి 179 రోజుల వడ్డీరేటు 5.5 శాతం నుంచి 6 శాతానికి, 180-210 రోజుల లోపు ఎఫ్‌డీలపై 6.75 శాతానికి, 211 రోజుల నుంచి ఏడాది లోపు ఎఫ్‌డీలపై వడ్డీని 6.5 శాతం నుంచి 7 శాతానికి సవరించింది. అలాగే ఏడాది నుంచి రెండేండ్ల లోపు టర్మ్ డిపాజిట్లపై వడ్డీరేటును 6.8 శాతం నుంచి 7.3 శాతానికి, 2 ఏండ్ల నుంచి మూడేండ్ల లోపు కాలపరిమితి డిపాజిట్లపై వడ్డీని 7.5 శాతానికి పెంచింది. మూడేండ్ల నుంచి ఐదేండ్ల లోపు డిపాజిట్లపై వడ్డీరేటును 6.75 శాతం నుంచి 7.25 శాతానికి సవరించిన బ్యాంక్, ఐదేండ్ల నుంచి 10 ఏండ్లలోపు డిపాజిట్లపై వడ్డీరేటును 7.50 శాతానికి పెంచింది.

**మరో ఐదు బ్యాంకులు కూడా..**

*ఎస్బీఐతోపాటు మరో ఐదు బ్యాంకులు ఎంసీఎల్ఆర్ రేట్లను సవరించాయి. వీటిలో హెచ్‌డీఎఫ్‌సీ, యెస్ బ్యాంక్, కెనరా, పీఎన్‌బీ, ఐడీబీఐ బ్యాంకులు ఉన్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఎంసీఎల్ఆర్‌ని 5 బేసిస్ పాయింట్లు సవరించింది. దీంతో రుణాలపై వడ్డీ రేటు 9 శాతం నుంచి 9.35 శాతం మధ్యలోకి చేరాయి. అలాగే యెస్ బ్యాంక్ ఎంసీఎల్ఆర్ రేటు 9.25 శాతం నుంచి 10.60 శాతం మధ్యలో ఉండగా, కెనరా బ్యాంక్ ఎంసీఎల్ఆర్ రేటు 8.15 శాతం నుంచి 9.30 శాతంలోకి, పీఎన్‌బీ రేటు కూడా 8.25 శాతం నుంచి 9.10 శాతం మధ్యలో వసూలు చేస్తున్నది. అలాగే ఐడీబీఐ బ్యాంక్ ఎంసీఎల్ఆర్ రేటు 8.35 శాతం నుంచి 10 శాతం లోపు నిర్ణయించింది.*

**బ్యాంక్ ఎంసీఎల్ఆర్ తీరు..**

- ఒక్కరోజు రుణాలపై ఎంసీఎల్ఆర్ 8 శాతం నుంచి 8.10 శాతానికి..
- నెల, మూడు నెలల కాలపరిమితి రుణాలపై వడ్డీరేటు 8.20 శాతం నుంచి 8.30 శాతానికి
- ఆరు నెలల కాలపరిమితి రుణాలపై ఎంసీఎల్ఆర్ 8.55 శాతానికి పెంచింది. అంతకుముందు ఇది 8.45 శాతానికి..
- ఏడాది రుణాలపై ఎంసీఎల్ఆర్ 8.55 శాతం నుంచి 8.65 శాతానికి సవరించింది
- రెండేండ్ల కాలపరిమితి రుణాలపై రేటు 8.75 శాతం నుంచి 8.85 శాతానికి పెంచింది.
- మూడేండ్ల రుణాలపై ఎంసీఎల్ఆర్ 8.85 శాతం నుంచి 8.95 శాతానికి సవరించింది.

**బ్యాంక్ బేస్ రేటు**

10.40 శాతంగా నిర్ణయించింది.

**ఎంసీఎల్ఆర్ అంటే**

మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్(ఎంసీఎల్ఆర్) కంటే తక్కువ వడ్డీరేటుకు రుణాలు ఇవ్వడానికి బ్యాంకులకు అవకాశం లేదు.




## ఫ్రెషర్లకు ఐటీ సంస్థల దెబ్బ!

న్యూఢిల్లీ, జూన్ 15: దేశీయ ఐటీ సంస్థలు గడ్డుపరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. అంతర్జాతీయ దేశాలపై ఆర్థిక మాంద్యం పిడుగుపడటంతో ఐటీ సంస్థలు నిర్వహణ ఖర్చులను తగ్గించుకోడానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నాయి. ఇప్పటికే పలు ఉద్యోగులను తొలగించిన సంస్థలు..తాజాగా క్యాంపస్‌ల నుంచి రిక్రూట్ చేసుకున్న ఉద్యోగులకు నియామకాలను నిలిపివేశాయి. దేశీయ ఐటీ దిగ్గజాలైన టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, ఎల్‌టీఐమైండ్‌ట్రీ, జెన్సర్‌లు ఏకంగా 10 వేల మంది ఫ్రెషర్లకు మొండిచెయ్యి చూపించాయి సంస్థలు. ఆన్ బోర్డింగ్‌లోవున్న ఉద్యోగులకు నిరాశతప్పటం లేదని నాస్కెంట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎంప్లాయిస్ సెనేట్(ఎన్ఐటీఈఎస్) విడుదల చేసిన నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. దేశీయ టాప్ ఐటీ సంస్థల్లో ఉద్యోగం వచ్చిందని సంబరపడుతున్న ఫ్రెషర్ల ఆశలు గండికొడుతున్నాయని ఎన్ఐటీఈఎస్ ప్రెసిడెంట్ హర్‌ప్రీత్ సింగ్ సాలుజా తెలిపారు. ముఖ్యంగా గడిచిన ఆర్థిక సంవత్సరంలో టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రోలో ఉద్యోగుల సంఖ్య సంయుక్తంగా 64 వేల వరకు తగ్గాయి. గడిచిన ఆర్థిక సంవత్సరంలో 50 వేల మంది ఫ్రెషర్లను నియమించుకున్న ఇన్ఫోసిస్..ఈసారి 11,900 మందిని మాత్రమే రిక్రూట్ చేసుకున్నది. రెండేండ్ల క్రితం భారీ స్థాయిలో సిబ్బందిని రిక్రూట్ చేసుకోనున్నట్లు ప్రకటించిన సంస్థలు ప్రస్తుతానికి వెనుకుంజవేస్తున్నాయి. అంతర్జాతీయ క్లయింట్లు ఖర్చులు తగ్గించుకోవడానికి అధిక ప్రాధాన్యతనివ్వడం కూడా రిక్రూట్‌మెంట్లకు బ్రేక్‌పడినట్లు అయింది. అంతర్జాతీయ ఆర్థిక రంగంలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల కారణంగా ఈ సారి ఎంత మందిని ఫ్రెషర్లను తీసుకునేదానిపై ఇంకా స్పష్టత రాలేదని ఐటీ ప్రతినిధి ఒకరు చెప్పారు. 2022లో మొత్తం రిక్రూట్‌మెంట్లలో 3-5 శాతం వరకు ఫ్రెషర్లను నియమించుకున్న టాప్ ఐటీ సంస్థలు.. ఇప్పటి వరకు వారికి ఎలాంటి రోల్‌ను అప్పగించలేదని టీమ్‌లీజ్ వెల్లడించింది. ప్రాజెక్టులు తగ్గుముఖం పట్టడం, ఫ్రెషర్లలో ప్రతిభ లేకపోవడం కూడా ప్రధాన కారణాలని పేర్కొంది. టీసీఎస్‌లో 2021-22లో 59 శాతంగా ఉన్న యువ ఉద్యోగుల వాటా గత ఏడాది 50.3 శాతానికి తగ్గింది.




### నెక్సస్ సరికొత్త ఈ-స్కూటర్

చెన్నై, జూన్ 15: దేశీయ మార్కెట్లోకి సరికొత్త ఫ్యామిలీ ఎలక్ట్రిక్ స్కూటర్ యాంపిర్ నెక్సస్‌ను పరిచయం చేసింది గ్రేవ్స్ ఎలక్ట్రిక్ మొబిలిటీ సంస్థ. చెన్నై షోరూంలో ఈ స్కూటర్ ధర రూ.1,09,900. ఈ సందర్భంగా కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈవో కే విజయ కుమార్ మాట్లాడుతూ..30 శాతం అధిక బ్యాటరీ లైఫ్, మరింత పవర్‌ఫుల్‌తో తీర్చిదిద్దిన ఈ స్కూటర్ నాలుగు రంగుల్లో లభించనున్నదన్నారు. ప్రస్తుతానికి చెన్నైలో లభించనున్న ఈ స్కూటర్ దశలవారీగా దేశవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# పొదుపు ట్రెండ్ మారుతున్నది..

- చేతిలో డబ్బులు ఉంచుకునేందుకు ప్రజల ఆసక్తి
- మారుతున్న సేవింగ్స్ పద్ధతులపై హోం క్రెడిట్ అధ్యయనం



హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 15 (నమస్తే తెలంగాణ): నాభి నిండితే నవాబుకైన జవాబు చెప్పొచ్చు అనేది పాత సామెతగా మారింది. జేబు నిండుగా పైసలు ఉంటే నవాబులాగైనా బతకొచ్చనేది నేటి విధానంగా... పొదుపు విధానంలో మార్పు వస్తున్నది. ఇటీవల కాలంలో మెట్రో నగరాల్లో నివసించేవారు పొదుపు చేసే పద్ధతిని మార్చుకుంటున్నారు. తాజాగా హోం క్రెడిట్ సంస్థ చేసిన అధ్యయనంలో చేతిలో డబ్బులు ఉంచుకోవడమే అసలైన పొదుపుగా భావిస్తున్నట్లుగా తేలింది. గతంలో మాదిరిగా స్టాక్ మార్కెట్లు లేదా డిపాజిట్లు, ఇతర ఆర్థిక మార్గాల్లో పెట్టుబడి పెట్టిన వాళ్లే... ఇప్పుడు వాటన్నింటికంటే చేతిలో డబ్బులు ఉంచుకోవడమే సురక్షితమని అనుకుంటున్నట్లుగా తన నివేదికలో వెల్లడించింది. ఒకవైపు సైబర్ నేరాలు, మరోవైపు స్టాక్ మార్కెట్ల భారీ నష్టాలతో పొదుపు విషయంలో జనాభిప్రాయం మారుతున్నదని అధ్యయనంలో తేలింది. సంపాదించిన పైసలు కళ్ల ముందర ఉండటమే మంచిదనే భావన ఎక్కువైపోయింది. ఆన్‌లైన్ మోసాలు, నష్టాల భయం కారణంగా డబ్బులను ఇతర మార్గాల్లో పెట్టుబడులు పెట్టడానికి వెనుకంజవేస్తున్నారు. పాత కాలంలో మాదిరిగా సంపాదించిన డబ్బులను ఇంట్లో నిల్వ చేసుకునే విధానం ఇటీవల కాలంలో భారీగా పెరిగిందనీ చెబుతున్నారు. దేశంలోని అన్ని మెట్రో నగరాలను ప్రామాణికంగా తీసుకుని చేసిన అధ్యయనం ద్వారా మెజార్టీ జనాలు క్యాష్ సేవింగ్‌కు ప్రాధాన్యత ఇస్తున్నట్లుగా స్పష్టమైంది. చేతిలో డబ్బులు ఉంటేనే ఆర్థిక స్వతంత్రత, సాధికారికతగా భావిస్తున్నారు. ఈ తరహా ఆలోచన ధోరణి మహిళల్లో ఎక్కువగా ఉండేదని, కానీ మగవారు కూడా ఇదే తరహా పొదుపు మంచిదనే భావనతో ఉన్నారు.

**దక్షిణాదిలోనూ ఎక్కువే..**


దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో డబ్బులను పొదుపు చేస్తున్న వారిలోనే ఎక్కువగా దక్షిణాదికి చెందినవారని తెలిపింది. ఇందులో మహిళలు ముందు వరుసలో ఉండగా.... ఇటీవల కాలంలో 39 శాతం మంది పురుషులు కూడా క్యాష్ రూపంలోనే సేవింగ్ చేస్తున్నట్లుగా వెల్లడైంది. ఉత్తరాదిలో 26శాతం మందే క్యాష్ సేవింగ్ పాటిస్తే, దక్షిణాదిలో 80 శాంత మంది ఇంట్లో డబ్బులను నిల్వ చేసుకుంటున్నారు. అదేవిధంగా మెట్రో నగరాల వారీగా 53 శాతం, టైర్ 1 నగరాల్లో 28శాతం, టైర్ 2 నగరాల్లో 38శాతం మంది క్యాష్ సేవింగ్ విధానమే సురక్షితంగా భావిస్తున్నారు.

**నగదు పొదుపు గణాంకాలు**

పురుషులు: 37 శాతం

మహిళలు : 59 శాతం

**పొదుపు చేస్తున్న వారిలో నగరాల వారీగా...**



| | |
|---|---|
| చెన్నై | 65 శాతం |
| బెంగుళూరు | 82 శాతం |
| హైదరాబాద్ | 82 శాతం |
| కొచ్చి | 88 శాతం |

### టీసీఎస్‌కు గట్టి షాక్

న్యూయార్క్, జూన్ 15: దేశీయ ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్)కు గట్టి షాక్ తగిలింది. వాణిజ్య రహస్యాలను బయటపెట్టిందన్న కేసులో టీసీఎస్‌పై 194 మిలియన్ డాలర్ల(రూ.1,600 కోట్లకు పైమాటే) జరిమానా విధించింది అమెరికా డిస్ట్రిక్ట్ కోర్ట్. తమ వ్యాపార రహస్యాలను బయటపెట్టిందని ఆరోపిస్తూ కంప్యూటర్ సైన్సెస్ కార్పొరేషన్..టీసీఎస్‌పై గతంలోనే కేసు నమోదు చేసింది. దీనిపై విచారించిన యూఎస్ కోర్టు ఈ తీర్పును వెల్లడించింది.

### అమెరికా మార్కెట్లు క్రాష్!

న్యూయార్క్, జూన్ 15: వచ్చే ఏడాది అమెరికా స్టాక్ మార్కెట్లు కుప్పకూలే అవకాశాలున్నాయని ఆ దేశ ఆర్థికవేత్త హ్యారీడెంట్ హెచ్చరించారు. 2008 ఆర్థిక సంక్షోభ సమయంలో జరిగిన మార్కెట్ పతనం కంటే ఇది అధికంగా ఉండే అవకాశం ఉన్నదని తెలిపారు. అమెరికా మార్కెట్లు కుప్పకూలితే అంతర్జాతీయంగా స్టాక్ మార్కెట్లు పాతాళంలోకి పడిపోయే ప్రమాదం ఉన్నదన్నారు.